# తండ్రి గారి సందేశం....



## యేసు చేయని ప్రార్థన

**క్రీస్తు నాథుని యందు ప్రియ సహోదరీ సహోదరులారా!**

పరిశుద్ధ గ్రంథంలో యేసు చేయ గలిగినప్పటికీ చేయని ప్రార్థన ఒకటి ఉంది. ఇది మనకు ఆశ్చర్యమనిపించవచ్చు. కానీ ఆ సంఘటన మనకు ఒక గొప్ప పాఠమును నేర్పిస్తుంది. దానిని గూర్చి మనం కొద్దిగా ధ్యానిద్దాం.

**"నేను తండ్రిని ప్రార్థింపలేననుకొంటివా? ప్రార్థించిన ఈ క్షణమున ఆయన పండ్రెండు దళముల కంటె ఎక్కువమంది దూతలను పంపడా? (మత్తయి 26,53).**

పాస్కాను భుజించినప్పుడు మరియు దివ్య సంస్కారమును స్థాపించినప్పుడు, యేసు తన అపోస్తులులతో ప్రార్థించాడు (మత్తయి 26,26-27). ఆయన తన అపోస్తులులతో సంభాషించిన వీడ్కోలు సంభాషణలలో (యోహాను 14-16 అధ్యాయాలు) వారు ప్రార్థించాలని ఆయన వారిని ప్రోత్సహించాడు. ఆయన వారితో "తండ్రి కుమారుని యందు మహిమ పరుప బడుటకు మీరు నా పేరిట ఏమి అడిగినను చేసెదను" (యోహాను 14,13) అని అన్నాడు. "ఆనాడు మీరు నన్ను ఏమియు అడుగరు. నేను మీతో నిశ్చయముగా చెప్పుచున్నాను. మీరు తండ్రిని నా పేరిట ఏమి అడిగినను ఆయన మీకు అనుగ్రహించును" (యోహాను 16,23) అని ప్రార్థన యొక్క గొప్పతనాన్ని నేర్పించాడు. ఆయన వారి సమక్షములో మహా ప్రధాన యాజకుని ప్రార్థన చేశాడు (యోహాను 17,1-26). ఆయన ఉద్వేగముతో తన తండ్రిని వేడుకొంటూ గొప్ప అపేక్షతో గెత్సమని తోటలో ప్రార్థించాడు (మత్తయి 26,39-46).

ప్రార్థన ముగిసిన తరువాత తనను పట్టుకొనవలెనని సాయుధులై వచ్చిన వారిని కలుసుకొనుటకు యేసు ముందుకు వచ్చాడు. ఆయన తనను తాను వారికి అప్పగించుకొనుచు, ఆయన చేయవలెనని ఆశించిన ప్రార్థన ఒకటున్నది. దానిని ఆయన వారికి స్పష్టము చేశాడు. సైన్య సమూహము ఆయనను పట్టుకొని బంధించినప్పుడు, పేతురు తన కత్తిని దూశాడు. మల్కాసు అను పేరు గల ఒకని చెవిని తెగనరికాడు. అటువంటి దౌర్జన్యమును ఆపవలసినదిగా యేసు తన శిష్యులకు ఆజ్ఞాపించి మల్కాసు చెవిని బాగుచేశాడు. అప్పుడు యేసు పేతురుతో "నీ కత్తిని ఒరలో పెట్టుము. తండ్రి నాకు ఇచ్చిన శ్రమల పాత్రను నేను పానము చేయవలదా?" అనెను (యోహాను 18,11). **"నేను నా తండ్రిని ప్రార్థింపలేననుకొంటివా? ప్రార్థించిన ఈ క్షణమున ఆయన పండ్రెండు దళముల కంటె ఎక్కువమంది దూతలను పంపడా?" (మత్తయి 26,53)** అని అన్నాడు.

తనను విడిపించుటకు పరలోక దూతల సైన్యసమూహమును పంపవలెనని యేసు తన తండ్రిని అడుగవచ్చు, కానీ ఆయన అలా ప్రార్థించలేదు. ఆయన ఆజ్ఞాపించినంతలోనే పరలోక సైన్యసమూహము వచ్చే ఆదేశమివ్వగల అపరిమితమైన శక్తి కలిగిన వాడు మన రక్షకుడు. ఒక్క పిలుపునిచ్చినంతలోనే ఆయన

యొద్దకు పరుగెత్తుకొని వచ్చుటకు దూతల సర్వసైన్యసమూహము సర్వశక్తిమంతమైన దేవుని సింహాసనము యెదుట సంసిద్ధముగా ఉంది. అలాగైతే ఆయన ఎందుకు ప్రార్థించలేదు? ఆయన వారిని ఎందుకు పిలువలేదు? యేసు హృదయములో ఏముందో తెలుసుకోవడమే ఈ ప్రశ్నకు జవాబు.

**1. విధేయతగల ఆయన హృదయము ఆయనను ఆ ప్రార్థనను చేయనీయలేదు.** తన తండ్రి చిత్తమును నెరవేర్చాలి అని తన హృదయములో దృఢముగా నిశ్చయించుకొన్న యేసు వేదనతో ప్రార్థన చేయుటలో రాత్రంతా గడిపాడు. కనీసము మూడుసార్లు, "నా ఇష్టము కాదు, నీ చిత్తమే నెరవేరనిమ్ము" అని తన తండ్రితో చెప్పాడు (మత్తయి 26,39). "ఆయన అన్ని విధముల మానవమాత్రుడై ఉండి, అంత కంటె వినయముగలవాడై, మరణము వరకును, సిలువపై మరణము వరకును, విధేయుడాయెను" (ఫిలిప్పీ 2,8). తన తండ్రి రక్షణ ప్రణాళిక నెరవేరాలంటే ఆ ప్రార్థన చేయకూడదని యేసుకు తెలుసు. కాబట్టే ఆయన ఆ ప్రార్థన చేయలేదు.

**2. ఆయన ఆ ప్రార్థన చేయుటకు నీతిమంతమైన ఆయన హృయము ఆయనను అనుమతించలేదు.** తన గొప్ప బలియాగము ద్వారా దేవుని నీతిని ప్రకటించుటకు యేసు ప్రభు ఈ లోకానికి వచ్చాడు. "తాను నీతి మంతుడననియు, యేసు నందు విశ్వాసము గల వానిని నీతిమంతునిగా చేయుదుననియు నిరూపించుటకు దేవుడు ఇట్లు చేసెను" (రోమీ 3,26). ఆయన పాప దోషమును సిలువ ద్వారా సంధించాడు. దేవుని పరిపూర్ణమైన కుమారుడుగా, "క్రీస్తు పాపరహితుడు. కాని, దేవుడు మన నిమిత్తమై ఆయనను పాపముగ చేసెను. ఏలయన, ఆయనతో ఏకమగుటవలన, మనము దేవుని నీతిగ రూపొందవలెనని అట్లు చేసెను" (కొరింతీ 5,21). ఏదేను తోటలో తొలి పాపము చేయబడినది మొదలుకొని సిలువ వరకు, ఒక విధముగా, పాపము ఈ లోకమును ఏలింది. ప్రభు యేసు రక్తము చిందింపబడుటతో, దేవుని నీతి వలన కృప ఈ లోకంలో విస్తరించుచున్నది. విధేయతతో కూడిన విశ్వాసము ద్వారా క్రీస్తు నొద్దకు వచ్చు ప్రతి వాని పాపములు క్షమింపబడుతాయి. మన యేసు ప్రభు నీతిమంతుడైనవాడు. అందుకే ఈ సంఘర్షణలో నుండి కాపాడి సంరక్షించుటకు దేవుడు తన దూతలను పంపాలని ఆయన ప్రార్థించలేక పోయాడు. ఆయన అటువంటి ప్రార్థన చేయకుండునట్లు ఆయన నీతి ఆయనను నిరోధించింది.

**3. ప్రేమగల ఆయన హృదయము ఆయనను ఆ ప్రార్థన చేయనీయలేదు.** ఆయన తన మరణము ద్వారా మనకు తండ్రి ప్రేమను కనపరచుటకు వచ్చాడు. ఆ ప్రేమయే ఆయన తనను తన కంటె మనకు ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చునట్లు చేసింది. "కాని పాపాత్ములమై ఉన్నప్పుడే క్రీస్తు మన కొరకై మరణించెను గదా! ఇట్లు దేవుడు మనపై తనకు ఉన్న ప్రేమను చూపుతున్నాడు" (రోమీ 5,8). సైనికులను, ప్రధాన యాజకులను యేసు సమీపించడం మనము గమనించినప్పుడు, "తన స్నేహితుని కొరకు తన ప్రాణమును ధారపోయు వాని కంటె ఎక్కువ ప్రేమకలవాడు ఎవడును లేడు" (యోహాను 15,13) అనే వాక్యం గుర్తుకువస్తుంది.

యేసు సహింపశక్యము కాని వేదనతో సిలువపై వ్రేలాడుచుండినప్పుడు ఆయనను విమర్శిస్తూ "నీవు దేవుని కుమారుడవైతే సిలువ మీద నుండి దిగుము" (మత్తయి 27,40) అని అన్నారు. "ఇతను ఇతరులను రక్షించెను గాని, తనను తాను రక్షించుకొన లేడాయెను. ఇతడు ఇస్రాయేలీయుల రాజు గదా! ఇపుడు సిలువ నుండి దిగి రానిమ్ము, అపుడు మేము

విశ్వసింతుము” అని హేళన చేసారు. “ఇతడు దేవుని నమ్మెను. ‘నేను దేవుని కుమారుడను’ అని చెప్పెను. కనుక దేవుని కిష్టమైన, ఇతనిని ఇప్పుడు రక్షింపనిమ్ము” అని అన్నారు (మత్తయి 27,42-43). ఈ సిలువ మరణ శ్రమ దైవసంకల్పము ప్రకారము లోక రక్షణార్థమైన పాపపరిహారార్థ యాగబలిగా నియమించబడినదని తెలిసిన యేసు ప్రభు దానిని అనుభవించుటకే ఇష్టపడ్డాడు. ఆయనను విడిపించుమని తండ్రిని ఏ క్షణములోనైనా ఆయన అడిగియుండగలడు. అప్పుడు తండ్రి అందుకు అవసరమైన సముచిత ఏర్పాటు చేసేవాడు. దేవుడు చేయవలసినదెల్లా కలువరి గిరి వైపు అలా ఒక్కసారి చూస్తే, అప్పుడు సిలువ మరణము సంపూర్తిగా స్తంభించిపోయేదే. కాని, యేసు తన విడుదల కొరకు ప్రార్థించలేదు. మన ప్రభువు శ్రమయను అగ్ని గుండము గుండా వెళ్ళడానికి, మనలను రక్షించడానికి దృఢసంకల్పముగలవాడై ఉన్నాడన్నది సత్యం.

ప్రియ సహోదరీ సహోదరులారా! యేసు ప్రభు తన కంటే ఎక్కువగా దేవుని చిత్తానికి ప్రాధాన్యమిచ్చాడు. మన జీవితంలో కూడా ఇటువంటి ఇబ్బందికర పరిస్థితులు వచ్చినప్పుడు మనము కూడా మన జీవితాన్ని, మన కుటుంబాన్ని దేవుని చిత్తానికి లోబడి ముందుకు సాగేలా వాటిని ఎదుర్కుందాం. మనం అనుభవించే బాధలు, శ్రమలు క్షణకాలం పాటు ఉండే ఓటమి అని తెలుసుకొని దాని తర్వాత దేవుడు మన కొరకు ఒక గొప్ప విజయాన్ని సిద్ధ పరచాడన్న గొప్ప నిరీక్షణతో విశ్వాస జీవితంలో ముందుకు సాగుదాం.

**జీవము గలిగిన సజీవ దేవుని జీవస్వరం**
**మనలనందరిని జీవింపజేయును గాక. ఆమెన్.**

క్రీస్తు నందు మీ తండ్రి
**బిషప్ ప్రిన్స్ అంతోని**
ఆదిలాబాద్ గురుపీఠ మేత్రాణులు

## ధ్యాన కేంద్ర నిర్మాణము కొరకు ప్రార్థన

ప్రభువా, నీ నామ మహిమ కొరకు మరియు ఆదిలాబాద్ గురుపీఠంలో సువార్త వ్యాప్తి కొరకు నిర్మించబడుతున్న ధ్యానకేంద్రాన్ని ఆశీర్వదించండి. ఎటువంటి ఆటంకములు లేకుండా దానిని సకాలంలో పూర్తి చేయుటకు తద్వారా మీ సువార్తను ప్రకటించుటకు మాకు అనుగ్రహం దయచేయమని ప్రార్థించుచున్నాము. ఆమెన్.